క్లుప్తంగా

నేడు దేవుడుబాబు జాతర



దేవుడుబాబు విగ్రహం

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ గ్రామంలో దేవుడుబాబు జాతర బుధవారం నిర్వహిస్తున్నట్లు జాతర కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఉత్సవ విగ్రహ ఊరేగింపు, రాత్రి 10 గంటలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి దాదాపు 50 వేలమంది హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు.

ఘనంగా బంగారమ్మ ఘటాల తిరువీధి



చొక్కాపు వీధిలో బంగారమ్మతల్లి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

రామభద్రపురం: మండల కేంద్రంలో బంగారమ్మ ఘటాల తిరువీధి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఫిబ్రవరి 3వ తేదీన జరిగే అమ్మవారి పండగ నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించామని, పండగ రోజు వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు రోజుకో వీధిలో బంగారమ్మ తల్లి ఘటాలను ఊరేగిస్తామని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

పేదల ఇంట పథకాల పంట

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకంతో పేదల ఇంట సంక్షేమ పథకాల పంట పండుతోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తచెలికానివలస, రాజావలస గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో పలువురు చిన్నచిన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రతీ పథకం నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేయడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. సంక్షేమ పాలన సీఎం జగనన్నతో సాధ్యమని, ఇదే ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించి, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, మండల పార్టీ కన్వీనర్ వావిలపల్లి జగన్‌మోహనరావు, ఎంపీటీసీ పాండ్రంకి దుర్గారావు, మాజీ ఎంపీటీసీ కొవ్వాడ శ్రీరాములు, వైఎస్సార్ సీపీ నాయకులు వావిలపల్లి వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ పాలవలస రామచంద్రినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులను ప్రోత్సహించాలి

రాజాం: మహిళా రైతులను ప్రోత్సహించాలని, ఈ మేరకు వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా ఏపీఎంలు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి సూచించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజాం క్లస్టర్ పరిధిలోని ఏపీఎంలు, సీసీలతో సమావేశమైన ఆయన రైతు ఉత్పత్తి సంఘాల సంఖ్య పెరగాలన్నారు. పెరటి తోటలు, వాణిజ్య పంటల పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మునగ మొక్కల పెంపకం, వాటి పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైకేపీ ఏసీ వి.చిరంజీవి, ఏపీఎంలు ఎస్.అప్పలనాయుడు, టి.దధికుమార్, కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.





త్వరితగతిన సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే



సంతకవిటి: మండాకురిటిలో సర్వేను ఎంపీడీఓ రఘునాథాచారి

వంగర: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే త్వరితగతిన చేపడుతున్నారు. మండల స్థాయి అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకుంటున్నారు. అనంతరం వారి అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో పాటు ఏవైనా సమస్యలున్నా అడిగి తెలుసుకుంటున్నారు.

సంతకవిటి: మండలంలోని మండాకురిటి, గుళ్లసీతారంపురం, బొద్దూరు గ్రామాల్లో జరుగుతున్న సిటిజన్ ఔట్‌రీచ్ సర్వేను ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి మంగళవారం పరిశీలించారు. సర్వేలో భాగంగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

నేడు రెడ్డిపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రేగిడి: మండలంలోని రెడ్డిపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. సాయంత్రం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని, మండల స్థాయి నేతలు, కార్యకర్తలంతా హాజరు కావాలన్నారు.

పక్కాగా భూముల రీసర్వే

రాజాం: పక్కాగా భూముల రీసర్వే చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశమైన ఆయన సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, రైతులకు న్యాయం జరిగేలా సర్వే చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ నాగరాజు, టీపీఓ నాగలత తదితరులు పాల్గొన్నారు.

ఏఓ పరిశీలన

బాడంగి: మండలంలోని ఆనవరం గ్రామంలో సాగు చేస్తున్న మొక్కజొన్న, వేరుశనగ పంటలను ఏఓ కె.శిరీష మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా పంటలకు సోకే చీడపీడలు, తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు. మొక్కజొన్న పంటను ఆశించే కత్తెరపురుగు నివారణకు గ్రాము ఎమామెక్టిన్ బెంజోయెట్‌ను లీటరు నీటిలో కలిపి పంటకు పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే వేరుశనగ పంట పట్టే కుళ్లు తెగులు నివారణకు 2.5 గ్రాముల మంకొజెబ్ లేదా టెబుకొనజోల్-2ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

పీడీఎస్ బియ్యం వేలం

బొబ్బిలి: స్థానిక ఎం.ఎల్.ఎస్ పాయింట్ వద్ద సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణ ఆధ్వర్యంలో 108.15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను మంగళవారం వేలం వేశారు. తెర్లాం, గజపతినగరం, దత్తిరేజేరు మండలాల్లో గతంలో వివిధ కేసుల్లో పట్టుబడిన ఈ బియ్యాన్ని జామి మండలానికి చెందిన కుసుమంచి తాతాజీ కిలో రూ.21 చొప్పున బిడ్ వేసి, దక్కించుకున్నారని సీఎస్‌డీటీ తెలిపారు.

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

రాజాం: స్థానిక వైఎస్సార్ పార్కు వద్ద బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ నాయకులు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



















